సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 12 । ఏప్రిల్ । 2025


తలంబ్రాల క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు

చూసిన కనులదే భాగ్యం

నీలిమేఘ శ్యాముడు.. రఘుకుల సోముడు.. శ్రీరామచంద్రుడు.. కల్యాణ రామునిగా మారి.. సౌందర్య రాశి.. సుగుణాల తల్లి సీతమ్మను పరిణయమాడారు. నునుసిగ్గుల మొలకైన సీతమ్మకు నుదుటన కల్యాణ బొట్టు, బుగ్గన కాటుక పెట్టి.. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పట్టువస్త్రాలను అలంకరింపజేశారు. కోదండ రాముడు సర్వాభరణ భూషితుడై ఆశీనులయ్యారు. భక్తుల రామనామ సంకీర్తనలు.. వేద పండితుల చతుర్వేద పఠనం.. మంగళవాయిద్యాల నడుమ.. అర్చకులు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని కల్యాణాన్ని శుక్రవారం రాత్రి వెన్నెల్లో నయనానందకరంగా నిర్వహించారు. చూసిన కనులదే భాగ్యం అన్నట్లుగా వేడుక సాగింది.

- కమనీయంగా సీతారాముల కల్యాణం
- వైకుంఠాన్ని తలపించిన ఏకశిలానగరి
- పోటెత్తిన భక్తజనం
- మార్మోగిన రామనామం


ఒంటిమిట్టలో సీతారాముల వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు


పాల్గొన్న అశేష భక్తజనం

రాజంపేట/ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారామ కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఏకశిలానగరం రామనామంతో మార్మోగింది. దారులన్నీ భక్తులతో రద్దీగా మారిపోయాయి. జిల్లా నలు మూలల నుంచి కాకుండా పక్క జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముందుగా రామాలయంలోని సీతా,రామ,లక్ష్మణ మూర్తులను ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. కోదండ రామయ్య సీతమ్మవారిని పరిణయం ఆడిన వేల శిల్పకళాశోభితమైన కల్యాణ మండపం వైకుంఠాన్ని తలపించింది.

సంప్రదాయం.. ఎదుర్కోలు ఉత్సవం

ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సీతారామచంద్రులకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. ఉత్సవ వరులను పల్లకీపై కొలువుదీర్చారు. ప్రధాన ఆలయం నుంచి మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వేదిక పైన రంజిత సింహాసనంపై కల్యాణమూర్తులను ఆశీనులు చేశారు. అనంతరం పూజా సామగ్రిని సంప్రోక్షణ జరిపి ఎలాంటి విఘ్నాలు తలెత్తకుండా విష్వక్సేన పూజ నిర్వహించారు. 'కర్మణ్యేపుణ్యాహవచనం' అనే మంత్రంతో మండప శుద్ధి జరిపి కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. బంగారు ఆభరణాలను సీతమ్మకు అలంకరించి సకలోపచారాలు చేశారు. మధుపర్కపాసన అనంతరం పెరుగు, తేనె కలిపిన మిశ్రమాన్ని స్వామి వారికి నివేదించగా.. సీతమ్మ నొసటన కల్యాణ బొట్టును, బుగ్గన కాసింత దిష్టి చుక్క పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్పించిన ముత్యాలతలంబ్రాలు, పట్టువస్త్రాలను ధరించి పెళ్లికూతురిగా ముస్తాబైంది. ఆమెకు ఏ మాత్రం తీసిపోని విధంగా శివధనుస్సు విరిచిన శ్రీరామచంద్రమూర్తి.. అదే రీతిలో సర్వాభరణ భూషితుడై సీతమ్మ ఎదుట కూర్చున్నారు. తరువాత లోక క్షేమం కోసం మహా సంకల్పం పఠించి కన్యాదానం, గోదానం చేశారు. సీతమ్మకు రామయ్యకు చెరో 8 శ్లోకాలతో మంగళాష్టం చదివారు. హస్త నక్షత్రయుక్త శుభ లగ్నంలో 6:30 నుంచి 8:30 గంటల మధ్య సీతారాముల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. అనంతరం గౌరిదేవి, సరస్వతిదేవి, మహాలక్ష్మీ అమ్మవార్లను ఆహ్వానం చేసి సకల మంగళాలకు ఆలవాలమైన మంగళసూత్రానికి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యులు ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమశాస్త్ర వేదపండితులు మంగళసూత్రాన్ని భక్తులకు చూపించారు. సాక్షాత్తూ లక్ష్మీనారాయణుడైన శ్రీరామ చంద్రమూర్తి చేత, శ్రీ మహాలక్ష్మీ స్వరూపిణి సీతాదేవికి శాస్త్రోక్తంగా మంగళసూత్రధారణ నిర్వహించారు. ప్రభుత్వం తెచ్చిన ముత్యాల తలంబ్రాలు కల్యాణ మూర్తుల శిరస్సుపై వేసి కల్యాణం జరిపారు. అనంతరం నివేదన ఇచ్చి బ్రహ్మముడి వేశాక మహాదాశీర్వచనం నిర్వహించి హారతి ఇవ్వడంతో కల్యాణ క్రతువు ముగిసింది.

వేదిక.. సుందర దీపిక

కల్యాణ వేదికను టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా త్రేతా యుగం నాటి జనకపురిని గుర్తుకు తెచ్చేలా సుందరంగా ముస్తాబు చేశారు. వేదికపై ప్రాచీన ఆలయాలలోని కళాకృతులు, దశావతరాల సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వరిగింజలతో మండపం ఏర్పాటు చేశారు. రంగురంగుల పుష్పాలతో అందంగా తీర్చిదిద్దారు. చెరుకులు, టెంకాయ గెలలు, టెంకాయ పూత, అరటి ఆకులు, మామిడాకులు, హెలికానియమ్స్, టార్చ్ జింజర్, సీలం, ఆర్కిడ్, రెడ్ ఆంధూరియం తదితర విదేశీ జాతుల పుష్పాలతో అలంకరించారు. ఇందుకోసం 4 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్ ఫ్లవర్స్ వినియోగించారు. టీటీడీ ఉద్యానవన విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసులు పర్యవేక్షణలో రెండు రోజుల పాటు 120 మంది అలంకరణ నిపుణులు, 120 మంది టీటీడీ సిబ్బంది ఇందుకోసం పని చేశారు.

గజవాహనంపై కల్యాణ రాముడు

ఒంటిమిట్ట: శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి కల్యాణోత్స వం అనంతరం గజవాహనంపై కల్యాణరాముడు భక్తుల దర్శనమిచ్చారు. 9.30 నుంచి 10.30 వరకు స్వామివారు ఆలయ మాఢ వీధుల్లో విహరించారు. రాములోరి కల్యాణోత్సవం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా పోలీసులు అమలు చేసిన ఆంక్షలతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు భక్తులు కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

శివధనుర్భంగ అలంకారంలో...

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శివధనుర్భంగ అలంకారంలో స్వామివారు విహరించారు. చెక్కభజనలు, కేరళవాయిద్యాలు, కోలటాల నడుమ ఊరేగింపు కొనసాగింది. భక్తులుఅడుగుడునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో సీఎం బస

ఒంటిమిట్టలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం రాత్రి బసచేశారు. ఈ సందర్భంగా సీఎంను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు కలిసి మాట్లాడారు.


స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న వేద పండితులు


సీఎం చంద్రబాబు దంపతులను సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్


శివధనుర్భంగ అలంకారంలో స్వామివారి ఊరేగింపు

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శిగా బి.హేమంత్‌కుమార్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం సంయుక్త కార్యదర్శిగా జి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శిగా జి.రామసుబ్బారెడ్డిలను నియమించారు.

ఇండోక్సాకర్బ్ పురుగు మందును కొనరాదు

రాయచోటి జగదాంబసెంటర్: ముంబైకు చెందిన ఎం/ఎస్. ఘర్దా కెమికల్స్ లిమిటెడ్ వారు తయారు చేసిన ఇండోక్సాకర్బ్ 14.5 శాతం పురుగు మందును రైతులు కొనటం, వాడకం చేయరాదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురుగు మందు ప్రభుత్వ ప్రామాణిక పరీక్షలో నిర్ధారిత ప్రమాణాల్లో లేవని నిర్ధారించారన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

ఏపీ ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

రాయచోటి జగదాంబసెంటర్: ఏపీ ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష తేదీ మార్పు జరిగినట్లు డీఈఓ కె.సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్ష గతంలో ప్రకటించినట్లు ఈ నెల 20వ తేదీన జరగాలి. అయితే ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఈ నెల 21వ తేదీకి మార్చినట్లు చెప్పారు. అభ్యర్థులు ఏ మండలాల్లో ఆదర్శ పాఠశాలలో ఉన్నాయో అక్కడ ఈ నెల 21వ తేదీ ఉదయం 10 నుండి 12 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని ఆయన తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌ను www.cse.ap.gov.in, www.apms.apcfss.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ పేర్కొన్నారు.

విద్యార్థులతో చెడుగుడు!

- 3,4,5 తరగతులు మళ్లీ యథా స్కూళ్లకు పంపాలని సూచన
- ఇప్పుడు వీళ్లను ఒక పాఠశాలకే పంపాలని ఆదేశం
- రోజుకో ఆదేశాలతో విద్యాశాఖ అధికారుల్లో అలజడి, గందరగోళం


బి.కొత్తకోట మండలంలోని గట్టు హైస్కూల్



బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేస్తే..ప్రస్తుత కూటమి ప్రభుత్వం రోజుకో మౌఖిక ఆదేశాలతో చదువుతో చెడుగుడు ఆడుకుంటోంది. ఈరోజు ఇచ్చిన ఆదేశాలు మరుసటిరోజు ఉండటం లేదు. స్పష్టమైన, సరైన నిర్ణయం తీసుకోలేని ప్రభుత్వం..వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మార్పును సరి చేస్తామంటూ విద్యాశాఖను గందరగోళంలోకి నెట్టేస్తోంది. దీనిపై విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకోవడమేకాక విద్యావ్యవస్థ ఎటు పోతోందని వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో నంబర్ 117 ద్వారా ప్రాథమిక పాఠశాల్లోని 3,4,5 తరగతులను సమీప హైస్కూళ్లలో విలీనం చేయడం ద్వారా మార్పు తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం ఇది తప్పుడు నిర్ణయమని.. దీనిని సరిచేస్తామంటూ చేస్తున్న హడావిడి, అసంబద్ధ నిర్ణయాలతో విద్యాశాఖను బలహీన పర్చేలా ఉన్నాయని ఆ శాఖ అధికారులే అంటున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న ఆదేశాల అమలు, తల్లిదండ్రుల కమిటీల నుంచి తీర్మాన ఆమోదాలను బలవంతంగా చేయించడం కోసం జిల్లాలో విద్యాశాఖ అధికారులు మునిగిపోయారు.

వెనక్కి అంటే ఒక పాఠశాలకేనట

జిల్లాలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో 3,4,5 తరగతుల వారిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమీప హైస్కూళ్లలో విలీనం చేసింది. ఈ చర్య ఇక్కడికే పరిమితం చేసి విద్యా వ్యవస్థను పటిష్టం చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తప్పుపడుతూ గతంలో విలీనమైన 3, 4,5 తరగతుల విద్యార్థులు ఏ పాఠశాల నుంచి వచ్చారో వారిని తిరిగి అక్కడికే పంపాలని అధికారులకు ప్రభుత్వం నుంచి సూచనలు అందాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకునే పనిలో ఉండగానే మళ్లీ వెనక్కు పంపాల్సిన విద్యార్థులను ఆయా పాఠశాలలకు కాకుండా ఏ స్కూలులో ఎక్కువ మంది ఉంటారో అక్కడికి పంపాలని, మిగిలిన పాఠశాలలను అలాగే ఉంచాలన్న ఆదేశం అందింది. దీంతో పాత విధానం ఎక్కడ అమలు చేసినట్టని అధికార వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఇలా చేయడం ద్వారా గత ప్రాథమిక పాఠశాలలో 1,2 తరగతే ఉంటాయి. దీనికి ఒక ఉపాధ్యాయుడే ఉంటాడు. ఇలా చేయడం అంటే విద్యార్థులతో చెలగాటం ఆడటమే అవుతుంది.

అంగన్‌వాడీలను కలిపేస్తారట: ప్రస్తుతం1,2 తరగతులతో నడుస్తున్న ప్రాథమిక పాఠశాలలకు ఏకోపాధ్యాయులు ఉన్నారు. ఈ పాఠశాలల సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఇందులో కలిపి అంగన్‌వాడీకి వచ్చే పిల్లలను పాఠశాలలో పెట్టి చదివిస్తే సంఖ్య పెరగడం, అంగన్‌వాడీ టీచర్ కూడా అక్కడే పని చేస్తారు కాబట్టి ఇద్దరు టీచర్లు అవుతారన్న అభిప్రాయం కల్పిస్తోంది ప్రభు త్వం. దీనివల్ల అంగన్‌వాడీలకు వచ్చే పసిపిల్లల ఇబ్బందులు అన్నిఇన్నీకావు.

జిల్లాలో విద్యార్థులు, పాఠశాలల వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు:	1,711
విద్యార్థులు :	43,192
ప్రాథమికోన్నత పాఠశాలలు:	162
విద్యార్థులు:	11,202
ఉన్నతపాఠశాలలు:	304
విద్యార్థులు:	79,232
మొత్తం పాఠశాలలు:	2,177
విద్యార్థులు:	1,33,626

(కొత్త విధానాలతో ఈ పాఠశాలల సంఖ్య తారుమారు కాబోతోంది)

ఒక స్కూలు ఖాళీ

కొత్తగా ప్రతిపాదిస్తున్న విధానంపై ఒక సారి పరిశీలిస్తే..ఉదాహరణకు బి.కొత్తకోట మండలంలోని గట్టు జెడ్పీ హైస్కూలులో సమీపంలోని గుట్టపాళ్యం, గట్టు తెలుగు ప్రాథమి పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల విద్యార్థులను కలిపారు. ఇప్పుడు వీరిని ఈ రెండు పాఠశాలలకు తిరిగి పంపాలి. అయితే ఒక పాఠశాలకు మాత్రమే అందరినీ పంపుతారు. ఒక పాఠశాల ఖాళీగా ఉంటుంది. వేర్వేరు ప్రాంతాల నుంచి స్కూలుకు వచ్చే విద్యార్థులను ఇబ్బంది తెచ్చిపెట్టడమే కాక కొత్త సమస్యను తీసుకొస్తుంది.

30 మందిని చేర్పిస్తే ఐదో క్లాస్

జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1,2 తరగతుల పాఠశాలలకు ఐదోతరగతి వరకు కొనసాగాలంటే ఒక్కో పాఠశాలకు ఈనెల 15లోగా 30 మంది విద్యార్థులను చేర్పించాలని విద్యాశాఖ మౌఖిక ఆదేశాలిచ్చింది. హైస్కూళ్ల నుంచి తిరిగి వచ్చే 3,4,5 తరగతుల విద్యార్థులు ఒక పాఠశాలకే పంపిస్తారు కాబట్టి మిగిలిన 1,2 తరగతుల పాఠశాలకు పై తరగతుల నిర్వహణ ఉండదు. దీంతో ఇలాంటి పాఠశాలకు 30 మంది విద్యార్థులను చేర్పించే మెలికను పెట్టారని విద్యాశాఖ అధికారులు చెప్పారు. ఈ విధానం తొలగించే అవకాశమూ ఉందని అంటున్నారు. ఇలాంటి నిబంధన ఉపాధ్యాయులు, పాఠశాల విద్యతో చెలగాటం అడటమేనని వాపోతున్నారు.

యూపీ స్కూల్‌ను పరిశీలిస్తే..

యూపీ స్కూళ్లలో 6,7,8 విద్యార్థుల సంఖ్య 30 లేదా ఆపై సంఖ్య ఉంటే ఆ స్కూలు అక్కడే ఉంటుంది. ఉదాహరణకు కురబలకోట మండలం ముదివేడు ఉర్దూ యూపీ స్కూలులో 6,7,8 తరగతులు చదువుతున్న విద్యార్థుల సంఖ్య 30 లోపలే ఉంది. ఈ నిబంధన అమలు చేస్తే ఇక్కడ పై తరగతుల నిర్వహణ నిలిపివేస్తారు. ఈ విద్యార్థులంతా 15 కిలోమీటర్ల దూరంలోని పీలేరు నియోజకవర్గానికి చెందిన మండల కేంద్రం గుర్రంకొండ లేదా 20 కిలోమీటర్ల దూరంలో మదనపల్లె యూపీ స్కూళ్లకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా విద్యార్థులు విద్యకు దూరమై డ్రాపౌట్స్ పెరుగుతారు.

30కి తగ్గితే యూపీ స్కూళ్లు గోవిందా

ఇప్పుడు జిల్లాలో యూపీ స్కూళ్ల మనుగడకు గండం పొంచి ఉంది. జిల్లాలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉన్న యూపీ స్కూళ్లలో 6, 7, 8 తరగతుల్లో విద్యార్థుల సంఖ్య 30కి మించాలి. ఇందులో ఒకరు తగ్గినా ఆ తరగతులను యూపీ స్కూళ్ల నుంచి తొలగించి సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేయాలని నిర్ణయించారు. దీనికోసం గురువారం జిల్లాలోని విద్యాశాఖ అధికారులు సంబంధిత హెచ్‌ఎంలు, తల్లిదండ్రుల కమిటీలు ఆమోదించిన తీర్మానం కోసం తంటాలు పడ్డారు. ఈ తీర్మానం ఆమోదయోగ్యం కాదని యూపీ స్కూళ్ల హెచ్‌ఎంలు, కమిటీలు వ్యతిరేకించినా అధికారులు మాత్రం పట్టించుకోలేదు. ప్రభుత్వ ఆదేశాలు తీర్మానం ఇవ్వాల్సిందేనని విద్యాశాఖ అధికారులు పట్టుబట్టి ఆమోదాలు తీసుకుంటున్నారు. దీంతో జిల్లాలో ఎన్ని యూపీ స్కూళ్లు మూతపడతాయో లెక్క తేలనుంది.

పూలే ఆశయసాధనకు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్


పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

రాయచోటి: అణగారిన వర్గాల అభ్యున్నతికోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ఆ మహనీయుని చిత్రపటానికి కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ, అధికారులు, బీసీ సంఘ నాయకులు, ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు పాటుపడిన గొప్ప సంస్కర్తగా పూలే పేరొందారన్నారు. ఆ మహనీయుని ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకొని బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

- బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి నిమిత్తం 707 మంది లబ్ధిదారులు ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు చొప్పున మొత్తంగా రూ. 14.14 కోట్ల రాయితీ మెగా చెక్కును కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి సురేష్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ జయసింహ తదితరులు పాల్గొన్నారు.

16లోపు అభ్యంతరాలు తెలపాలి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు పూర్వపు జిల్లాల్లోని స్కూల్ అసిస్టెంట్(గవర్నమెంట్) నుంచి గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు(గవర్నమెంట్) తాత్కాలిక జాబితా వెబ్‌సైట్ https://rjdsekadapa.blogspot.comలో ఉంచినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యాముల్ తెలి పారు. కావున ఏవైనా అభ్యంతరాలు ఉన్నచో సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో తగిన ఆధారాలతో ఈ నెల 16లోపు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

వీఆర్‌ఓ అవినీతిపై నివేదిక ఇవ్వండి
– సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో లంచం వసూళ్లపై సోషల్‌మీడియా, పత్రికల్లో వచ్చిన వార్తలపై శుక్రవారం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ స్పందించారు. బీకే.పల్లె పంచాయతీలో ఓ భూమి భాగపరిష్కారాల్లో భాగంగా అన్నదమ్ములకు మ్యుటేషన్ చేసేందుకు రూ.5లక్షలు వీఆర్వో వసూలు చేశాడన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా తహసీల్దార్ ధనంజయులు, ఆర్‌ఐ భరత్‌ను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలపై రెవెన్యూ సిబ్బందిని సబ్ కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి విచారించారు. అలాగే బాధిత రైతులను, పంచాయతీ వీఆర్వోలను క్షేత్రస్థాయిలో విచారించాలన్నారు. అవినీతికి పాల్పడినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వేర్వేరు ఘటనలో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నంకు పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కలకడ మండలం నడిమిచెర్ల గ్రామానికి చెందిన చంద్రయ్య కుమారుడు రమణ(48) కుటుంబ సమస్యల కారణంగా పురుగు మందు తాగి ఆత్మహత్య యత్నంకు పాల్పడ్డాడు. అదే విధంగా మదనపల్లె పట్టణం శేషమహల్ ప్రాంతానికి చెందిన యువకుడు (18) తల్లిదండ్రులు మందలించారని లక్ష్మణరేఖ తిని ఆత్మహత్య యత్నంకు పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ


గాయపడిన నాగేంద్ర

సంబేపల్లె : చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిపై శుక్రవారం ట్రాక్టర్‌ను లారీ ఢీకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ ముదినేని వడ్డిపల్లెకు చెందిన నాగేంద్ర ట్రాక్టర్‌లో రాయచోటి వెళుతున్న క్రమంలో నారాణరెడ్డిపల్లె సమీపంలో పిలేరు నుంచి వస్తున్న లారీ ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ గాయపడ్డారు. 108 వాహనంలో అతడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టమాటా లారీ బోల్తా.. సుండుపల్లి వాసి మృతి

రాయచోటి : చిన్నమండ మండలం కేశాపురం చెక్‌పోస్టు వద్ద టమాటా లారీ బోల్తా పడి ఒకరు మృతి చెందారు. శుక్రవారం రాత్రి గుర్రంకొండ మండలం తరిగొండ నుంచి టమాటాల లోడుతో నంద్యాలకు వెళుతున్న వాహనం కేశవరం చెక్ పోస్ట్ వద్ద లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో సుండుపల్లి మండలం రాచంవాండ్ల పల్లెకు చెందిన వెంకటరమణ (53) టమాటా లారీ కిందపడి మృతి చెందాడు. సుండుపల్లి నుంచి వివాహానికి వెళ్తున్న ఆయన చెక్ పోస్ట్ వద్ద బస్సు దిగి రోడ్డు పక్కన ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్న చిన్నమండెం పోలీసులు తెలిపారు.

రిమ్స్‌లో ఫార్మసిస్ట్‌పోస్టు భర్తీకి పైరవీలు

- కాంట్రాక్ట్ పోస్టులో రెగ్యులర్ ఉద్యోగి భర్తీకి యూనియన్ నాయకులు అధికారులపై ఒత్తిడి
- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమన్న పాలనా విభాగా సిబ్బందికి బెదిరింపులు
- ఇందుకోసం 'పరిపాలనా విభాగం'లో కొందరి సహకారం?



కడప రిమ్స్ ఓపీ విభాగం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కడప గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (రిమ్స్)లో రెగ్యులర్ ఫార్మసిస్ట్- గ్రేడ్-2ను, ఫార్మసిస్ట్ కాంట్రాక్ట్ పోస్టులో నియమించమని యూనియన్ నాయకులు ఒత్తిడి తెస్తున్నారనీ ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందుకోసం యూనియన్ నాయకులు రూ. 5– 8 లక్షల వరకు వసూలు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రెగ్యులర్ ఉద్యోగిని నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్ట్ పోస్టులో ఉద్యోగిని నియమిస్తే జీతాలు సమస్య ఎదురవుతుందని తర్వాత భవిష్యత్తులో కాంట్రాక్టు ఉద్యోగి జాయిన్ అయితే రెగ్యులర్ ఉద్యోగస్తుని బయటికి వెళ్లాల్సి వస్తుంది. నిబంధన ప్రకారం కాంట్రాక్టు ఫార్మసీ పోస్టులో రెగ్యులర్ ఉద్యోగులకు పోస్టింగ్ లేదా బదిలీ ఇచ్చుట నిబంధనలకు విరుద్ధమని రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ వివరణతో యూనియన్ నాయకులు సంతృప్తి చెందలేదు. పైరవీలకు అలవాటు పడిన అధికార పార్టీ పేరుతో చలామణి అవుతున్న కొందరు యూనియన్ నాయకులు రిమ్స్ సిబ్బందిని చివరికి బెదిరింపు ధోరణికి పాల్పడిన సంఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈసంఘటన వివరాల్లోకెళితే ..ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీఎంఎస్ఐడీసీ)సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో వి.ఎన్‌పల్లి నుంచి డిప్యుటేషన్ లో ప్రస్తుతం ఓ రెగ్యులర్ ఉద్యోగి విధులను నిర్వహిస్తున్నారు. అతను తన మాతృశాఖకు వెళ్లుటకు సరెండర్ అయ్యారు. సరెండర్ అయిన ఉద్యోగి జిల్లా లోని ఏ పిహెచ్‌సీ లో పోస్టు ఖాళీగా ఉన్న కూడా పల్లెల్లో పోయి డ్యూటీ చేయుటకు ఇష్టం లేక రిమ్స్ జనరల్ హాస్పిటల్‌కు బదిలీ కావాలని ప్రయత్నించారు. యూనియన్ వారితో ఒక రేటు మాట్లాడుకుని ప్రయత్నాలు మొదలుపెట్టారు.. యూనియన్ నాయకులలో కొందరు సొంత లాభం ఆలోచించి రిమ్స్ సూపరింటెండెంట్ సంప్రదించారు. కాంట్రాక్ట్ పోస్ట్‌లో రెగ్యులర్ ఉద్యోగిని నియమించడం లేదా బదిలీ చేయడం డిపార్ట్‌మెంట్ నియమ నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. సదరు యూనియన్ లీడర్స్ సిబ్బందిని బెదిరించి జీతాలు విషయంలో మిగతా ఏ సమస్యలనైనా డీఎంఈ కార్యాలయం లో తమకు సహకరించు అధికారులు ఉన్నారు. డీఎంఈ ఇంకా పైస్థాయిలో మేం చూసుకుంటాము మీరు క్లారిఫికేషన్ రాయండి అని ఒత్తిడి చేశారు. అయినా రిమ్స్ సూపరింటెండెంట్ మొత్తం రిమ్స్ లో ఫార్మసిస్టులు పోస్టులు 11. రెగ్యులర్ ఉద్యోగులు 11 మంది పనిచేస్తున్నారని, 10 కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్ పోస్టులకు 9 మంది పని చేస్తున్నారని ఇటీవల ఒక కాంట్రాక్టు ఉద్యోగి రిజైన్ చేయడం వల్ల ఒక ఖాళీ ఏర్పడిందిదని, ఆ పోస్టు కాంట్రాక్ట్ పోస్ట్ మాత్రమే అని క్లారిఫికేషన్ ఆర్డీకి లెటర్ పెట్టారు. ఈ విధానానికి యూనియన్ నాయకులు సంతృప్తి చెందలేదు. కోర్టును ఆశ్రయిస్తామని రిమ్స్‌లో అధికారులను, సిబ్బందిని బెదరించడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. యూనియన్ నాయకులు తమ స్వార్థాలకు సమూహంగా ఏర్పడి చేసే మోసాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అధికారులు వీరి బెదిరింపులకు లొంగవద్దని పలువురు ఉద్యోగస్తులు కోరుకుంటున్నారు. ఈ సంఘటనలో జీజీహెచ్‌లోని ఓ మహిళా సీనియర్ అసిస్టెంట్ యూనియన్ నాయకుల బెదరింపులకు బెంబేలెత్తి పోయింది. మరోవైపు జీజీహెచ్(రిమ్స్)లో ఫార్మసీ విభాగంలోనే పనిచేస్తున్న రెగ్యులర్ మహిళా ఉద్యోగి ఈనెలలోనే రిటైర్డ్ కాబోతుందని సమాచారం. ఆమె స్థానంలో కూడా సదరు 'ఫార్మసీ ఆఫీసర్'ను నియమించేందుకు కూటమి అధికారపార్టీకి సన్నిహితంగా వుంటున్న పై యూనియన్ నాయకులు ప్రయత్నాలను ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు సమాచారం.

నీటి కుంటలో పడి ముగ్గురు చిన్నారుల మృతి


మృతి చెందిన చిన్నారులు

చిట్వేలి : అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం ఎం. రాచపల్లిలో శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చొక్కారాజు దేవాన్స్ (5), చొక్కారాజు విజయ్(4), రెడ్డిచెర్ల యశ్వంత్ (5) ఆడుకోవడానికి పక్కనే ఉన్న కుంట వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు అందులో ఉన్న నీటిలో పడి మృతి చెందారు. చిన్నారుల ఆచూకీ కోసం వెతుకుతుండగా కుంటలో విగతజీవులుగా పడి ఉన్నారు. వెంటనే ముగ్గురిని చిట్వేలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో గ్రామమంతా శోకసముద్రంలో మునిగిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

చిన్నారుల కోసం శిశుగృహలో సంప్రదించండి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్‌లో సాకేత్ (3), మల్లి (2) అనే చిన్నారులు ఉన్నారని తెలియడంతో ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్, మహిళా పోలీసులు చిన్నారులు తీసుకుని సీడబ్ల్యూసీ ఎదుట హాజరు పరిచామని ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఉన్నట్లయితే బాలల సంక్షేమ సమితిలో సంప్రదించి తీసుకు వెళ్లాలన్నారు.

చౌకదుకాణం సీజ్

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని శీలంవారిపల్లె గ్రామంలోని చౌకదుకాణాన్ని శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివశంకర్ ఆధ్వర్యంలో రేషన్ షాపును తనిఖీ చేయగా అందులో 4897 కేజీల బియ్యం, 128 కేజీల చక్కెర తక్కువగా ఉన్నట్లు గుర్తించి సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేయడంతో పాటు రేషన్ షాపును సీజ్ చేసినట్లు డీటీ తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

డీపీఓ రాజ్యలక్ష్మి


భాకరాపేటలో చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

సిద్దవటం : ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి పంచాయతీలోని భాకరాపేట మూడు రోడ్ల కూడలిలో ఉన్న దుకాణ దారులకు శుక్రవారం డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణదారులు చెత్తను చెత్తబుట్టల్లో వేసి ప్రతిరోజు గ్రామంలోకి వచ్చే హరిత రాయబారుల వాహనంలో చెత్తను వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వహించి గ్రామాన్ని పరి శుభ్రంగా పెట్టుకోవాలని తెలిపారు. కాలుష్య నివారణ కోసం గ్రామంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఒంటిమిట్టలోని కోందడ రామస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జేఎంజే కాలేజీ నుంచి జాతీయ ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బద్వేల్ డీఎల్‌పీఓ రమణారెడ్డి, ఏఓ ఖాదర్‌బాషా, గ్రామ కార్యదర్శి రాజేష్ స్థానిక నాయకుడు తుర్రా ప్రతాప్ పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై చంద్రబాబు కపట ప్రేమ

- సంక్షేమానికి బడ్జెట్‌లో ఒకరూపాయి కేటాయించలేదు
- రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు



ఓబులవారిపల్లె : జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బీసీలపై చంద్రబాబు నాయుడు కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని వైఎస్సార్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఫొటోలకు పోజులిస్తున్నారన్నారు. బీసీలకు, మైనార్టీల లబ్ధిదారులకు గుర్తించకుండా మేము బీసీలకు మైనార్టీలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది అని సీఎం, మంత్రులు అనడం హాస్యాస్పదమన్నారు. బడ్జెట్‌లో ఒక రూపాయి కేటాయించకుండా బీసీ, మైనార్టీ లబ్ధిదారులను గుర్తించకుండా ఏ విధంగా అభివృద్ధి చేసారని చేశారని ప్రశ్నించారు. అధికారంలోకి రావడానికి ఎన్నికలలో అబద్ధపు హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో బీసీలు, మైనార్టీలు, మహిళలు, యువత వారికి ప్రత్యేకంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు. నేడు మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలు, మైనార్టీలను మోసగిస్తున్నారని విమర్శించారు.

సమాజ పునర్నిర్మాణవేత్త పూలే

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : మహాత్మాజ్యోతిరావు పూలేకి సమాజ పునర్నిర్మాణవేత్తగా సముచిత స్థానం ఉందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జ్యోతిరావు పూలే 19వ శతాబ్దపు గొప్ప భారతీయ సంఘ సంస్కర్త అన్నారు. ఆయన దళితులు, మహిళల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడారన్నారు. అంటరానితనం, కుల వ్యవస్థను నిర్మూలించడానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైందన్నారు. సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించి సమాజంలో వెనుకబడిన వర్గాల వారికి సమాన హక్కులు కల్పించాలని పోరాడారన్నారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే ప్రభుత్వం వ్యవసాయ చట్టం ఆమోదించిందన్నారు. ఆయన చేసిన గొప్ప కృషిని గుర్తుచేసుకోవడం మనందరి కర్తవ్యమని, ఇలాంటి మహనీయులు అడుగుజాడల్లో నడవాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి, ఏఓ బి కృష్ణుడు, ఆర్‌ఐ ఎం పెద్దయ్య, సీసీఎస్ ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు బి అమర్నాథ్ రెడ్డి, జి రవి, డీపీఓ సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకట్రాముడు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరు సమీపాన పులివెందుల రోడ్డులో శుక్రవారం ట్రాక్టర్ ఢీకొని బైక్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా యాడికి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన వెంకట్రాముడు అరటి కాయలను లారీల లోడు నింపే కూలి పని చేసుకుంటూ పులివెందులలో నివాసముంటున్నాడు. వెంకట్రాముడు తన స్వగ్రామంలో జాతర ఉండటంతో శుక్రవారం కూలి పని తొందరగా ముగించుకొని తన స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా అంకాలమ్మ గూడూరు బలపనూరు గ్రామాల మధ్యలో ఎదురుగా ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట్రాముడు(38) మృత్యువాతపడ్డారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్



నిరసన తెలుపుతున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

రాయచోటి అర్బన్ : సమాజంలో బీసీలకు 52 శాతం రిజర్వేషన్‌లను కల్పించాలని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీ సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం జాతీయస్థాయిలో బహుజన సమాజ్‌పార్టీ పోరాటం చేస్తోందన్నారు. కులగణన ద్వారా బీసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కాగా కేంద్ర – రాష్ట్రప్రభుత్వాలు బీసీ ఓట్లతో గద్దెనెక్కి బీసీలకు మేలును చేకూర్చే కులగణన పట్ల నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తుండడం దారుణం అన్నారు. బీసీలకు న్యాయం జరిగేవరకు పోరాడతామన్నారు. బడుగు, బలహీనుల అభివృద్ధికి కృషిచేసిన జ్యోతిరావుపూలే, బాబు జగ్జీవన్ రామ్, అంబేడ్కర్‌ల బాటలో బహుజన యువత నడవాలంటూ ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు యుగంధర్, ఉపాధ్యక్షుడు మహేష్, సెక్రటరీ నరసింహులు, జనరల్ సెక్రటరీ సోమశేఖర్, సీనియర్ న్యాయవాది ఈశ్వర్, బహుజనవాది మల్లూరి రెడ్డిప్రసాద్, రజకసంఘం నేతలు రమేష్‌బాబు, శ్రీనివాసులు, న్యాయవాది నాగముని, బీసీ నేతలు నరసింహాచారి, జీవానందం, జయరామయ్య, రామమోహన్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే కులగణను చేపట్టాలి

రాయచోటి అర్బన్ : పాలకులు వెంటనే కులగణన కార్యక్రమాన్ని చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం నేతలుకె.వి.రమణ,ఈ.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట బీసీ కులసమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కులగణనను చేపట్టాలన్న డిమాండ్‌తో ఆ సంఘం నేతలు నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులగణన జరపడం ద్వారా సమాజంలో ఏయే కులాల ప్రజలు ఎంత శాతం మేర ఉన్నారనేది గుర్తించవచ్చునన్నారు. తద్వారా అన్ని కులాలకు సమన్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు దువ్వూరు నరసింహాచారి, పల్లపు రమణ మ్మ, పాలగిరి హబీబుల్లా, వడ్డెరసంఘం నేతలు నాగముని, జీవానందం, సీనియర్ అడ్వకేట్ ఈశ్వర్, రమేష్‌బాబు, వీరబల్లి శ్రీనివాసులుతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REALSTATE

PLOT FOR SALE

■6 లక్షలకే తిరుపతి IIT, IISER విద్యాసంస్థల ప్రక్కన ఫైనల్ అప్రూవ్‌తో ప్లాట్లు. డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్ర: 9502774175, 7995992114.

SERIVCES

PERSONAL CARE

CHANGE OF NAME

■ I SHAIK AZEEZ R/O 15-738, ZINNA ROAD, PRODDATUR, KADAPA DIST, AP. NOW I CHANGE MY NAME AS SHAIK ABDUL KHADAR.

WANTED

■ బద్వేల్ టౌన్ నెల్లూరు రోడ్ లో సత్యా గ్రూప్ వారి ద్వారకా గ్రౌండ్ లో సులభ వాయిదాలలో విలువైన ప్లాట్లు సెల్ చేయుటకు మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. పార్ట్ టైం జాబ్ గా ఆసక్తి గలవారు సంప్రదించండి. CEO సత్యాగ్రూప్. 9703727786, 7989576111

■Walk in interview for nursing Staff for 50 bedded hospital in proddatur. Qualifications GNM/ B.Sc nursing Exprience also considered. Contact : 9849294652

■ హైదరాబాద్‌లో VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు – 40వేలు.ఫ్రీ రూం+భోజనం. HYD.7995365999

■మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459.

■ కిసాన్ మిత్రలో NLM స్కీమ్ క్రింద రిలేషన్‌షిప్ మేనేజర్స్, DMలు కావలెను. జీతం: మేనేజర్స్‌కి 25 వేలు, DM లకి 35 వేలు. అర్హత: 10th to డిగ్రీ వరకు. సంప్ర॥ 9392282701, 9000501816, 8341890291.

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ KGR డెవలపర్స్ నందు మార్కెటింగ్ HEAD (జీతం 30K-50K+ Incentives) మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్ కావలెను. జీతం(10K-15K+ Incentives) కర్నూలు. సెల్: 63040 30020

గమనిక

సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

దోపిడీ, దౌర్జన్యాలకు మంత్రి మండిపల్లి తెర

- వైఎస్‌ఆర్‌సీపీ అధికార ప్రతినిధి రమేష్‌రెడ్డికి సంబంధించిన కంకర, సామగ్రి దోపిడీకి యత్నం
- మంత్రి అనుచరులను అడ్డుకున్న వైనం
- మట్టి, ఇసుక, కంకర, ఎర్రచందనం అక్రమ రవాణాలో మంత్రి, అతని అనుచరులు దోచుకుంటున్నారు
- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అరాచకాలపై మీడియా ముందు మండిపడిన ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి


నిల్వ ఉంచిన కంకరను అక్రమంగా తీసుకుపోతున్న టిప్పర్


అర్బన్ సీఐకు ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు రాయచోటి ప్రాంతంలో ఆయన అనుచరులు దోపిడీలు, దౌర్జన్యాలు, అరాచకాలు, దొంగతనాలకు తెర లేపారని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం రాత్రి మంత్రి సూచనల మేరకు జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం నిల్వ ఉంచిన కంకర, ఇతర సామగ్రిని దోపిడీ చేసేందుకు సిద్ధమయ్యారని రమేష్‌కుమార్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గంలో మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మేనల్లుడు మౌర్యారెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి మరికొందరితో కలిసి కుట్రలో భాగంగా జాతీయ రహదారి పనులు నిర్మాణం కోసం నిల్వ ఉంచిన కంకర, ఇతర మెటీరియల్‌ను దొంగతనంగా జేసీబీలతో టిప్పర్లకు పోసి దోపిడీకి యత్నించడం సిగ్గుచేటన్నారు. సమాచారం తెలుసుకుని నిల్వ ప్రాంతానికి చేరుకునేటప్పటికి 15, 20 టిప్పర్లు అప్పటికే తరలించారన్నారు. మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన వస్తువులనే దోపిడీ చేస్తున్నారంటే ఇక సామాన్యుడికి ఎక్కడ రక్షణ ఉంటుందని రమేష్‌రెడ్డి నిలదీశారు. అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు ఎంతటి నీచమైన సంస్కృతితో ముందుకు వెళ్తున్నారో వారు పాల్పడిన దోపిడీని చూస్తే తెలుస్తోందన్నారు. దౌర్జన్యాలు, అరాచకాలే కాకుండా దొంగతనాలకు పాల్పడటం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యమన్నారు. ఇప్పటికే మట్టి, ఇసుక, కంకర మిషన్ల దగ్గర కోట్ల రూపాయలు దోచుకుతింటున్నారని ఆరోపించారు. ప్రతి పని దగ్గర టీడీపీ నాయకులు కమీషన్ల రూపంలో దండుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ రోజు దౌర్జన్యంగా ఎమ్మెల్యేకి చొరబడి డబ్బులు సంపాదించే దిగజారుడుతనానికి దిగారు. మరో పక్క ఎర్రచందనాన్ని మంత్రి అనుచరులు భారీగా తరలించి కోట్ల రూపాయలు గడిస్తున్నారని వివరించారు. ఇంతటి దౌర్భాగ్య పరిస్థితి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జరుగుతున్నదంటే ఎవరు సిగ్గుతో తలదించుకోవాలో అర్థం కావడం లేదన్నారు. ఇదేనా గవర్నర్స్ అంటే కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇలాంటి వ్యవహారాలను చంద్రబాబునాయుడు ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ మండిపడ్డారు. ఇంతటి దురదృష్టకరమైన పాలన దౌర్జన్యకరమైన సంఘటన నా రాజకీయ జీవితంలో చూడలేదన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే పనులను ఎవరైనా టెండర్లలో పాల్గొనవచ్చన్నారు. టెండర్లు దక్కించుకుని పనులు చేసుకుంటుంటే మంత్రి ఇంజినీర్లకు చెప్పి పనులు ప్రారంభం కాకుండా నిలుపుదల చేయడం ఎంతవరకు సమంజసమో చెప్పాలన్నారు. అంతటితో ఆగక పనుల కోసం నిలువ ఉంచిన కంకర, ఇతర సామగ్రిని దోపిడీ చేయించే దౌర్భాగ్య స్థితిలో మంత్రి ఉండటం దురదృష్టకరమన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయానికి 200 మీటర్ల దూరంలో ఉన్న కంకర, ఇతర సామగ్రిని దోచుకెళ్లడం జిల్లాలో మంత్రి ఆగడాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో చెప్పకనే చెబుతున్నాయన్నారు. ఇంతటి దురదృష్టకరమైన పరిపాలనను ఒక్కసారి ప్రజలు ఆలోచించాలన్నారు. మంత్రి అరాచకలపై చంద్రబాబునాయుడు, లోకేష్‌లు దృష్టి సారించాలన్నారు. లేకుంటే మండిపల్లి దోపిడీ, దౌర్జన్యాలు మీ అనుమతులతోనే జరుగుతున్నాయా అనేది స్పష్టం చేయాలన్నారు. మీరే అనుమతి ఇచ్చినట్లయితే నేరుగా మీకే టాక్స్‌లు కడతామని తెలిపారు. ఎక్కడ ఎవరు అరాచకం చేసిన తాట తీస్తానని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పిన రోజునే ఆయన అనుచరులు దొంగతనాలకు పాల్పడటంపై సమాధానం చెప్పాలన్నారు. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇద్దరు పోలీసులను పంపారన్నారు. దౌర్జన్యంగా దొంగతనాలు చేస్తున్నారంటే ఇలాంటి వారిపైన ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను కోరుతున్నట్లు చెప్పారు. ఇలాంటి వారిపైన తక్షణం చర్యలు తీసుకొని అరాచకాలు ఆపుతారా లేదా వారిని రమేష్‌రెడ్డి డిమాండ చేశారు. 1999లో తాను ఎమ్మెల్యేగా పనిచేశానన్నారు. ఇది ప్రజాస్వామ్యమే కాదని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటమిలో ఉంటాయి, ప్రభుత్వాలు ఈ రోజు ఉంటాయి రేపు వెళ్తాయన్నారు. ఈ అరాచకాలకు పాల్పడిన వారు ఏ బొక్కలో దాక్కున్న భవిష్యత్తులో బయటకు తెచ్చి ఏం చేయాలో అవి చేస్తామని హెచ్చరించారు. మాకు ప్రభుత్వం వస్తుంది.. మేము అధికారంలోకి వస్తాం.. ఇలాంటి వారి కథ చూస్తాం అని ఘాటుగా స్పందించారు. అంత సులభంగా వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. చేతులకు గాజులు తొడుక్కొని ఇక్కడ ఎవరూ లేరంటూ హెచ్చరించారు. రామాపురం మండలం హసనాపురం గ్రామానికి చెందిన వినోద్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి మట్టి అమ్ముతూ ఒక్కొక్క లారీ నుంచి రూ.1200 వసూళ్లు చేస్తున్నట్లు విమర్శించారు. అంతేకాకుండా ఎర్రచందనం తరలించి సంపాదిస్తున్నట్లు చెప్పారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మేము తీసుకెళ్తున్నామని వినోద్‌కుమార్‌రెడ్డి ఓ సందర్భంలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంతకంటే దౌర్భాగ్యం ఉందా అని ప్రశ్నించారు. తాను టీడీపీలో 25 సంవత్సరాలు పనిచేశానన్నారు. ఎన్నికల ముందు నాకు నచ్చక పార్టీ నుంచి బయటికి వచ్చానన్నారు. నా మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడతారా.. కక్ష సాధింపు అంటే దొంగతనాలు చేయడమా అని ఆయన విరుచుకుపడ్డారు. జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే అయినా నా ఆస్తికే భద్రత లేదు అంటే సామాన్యుడి ఆస్తికి ఏం భద్రత ఉంటుందో పోలీసు అధికారులు చెప్పాలన్నారు.

సీఐకి ఫిర్యాదు

రాయచోటి ఎస్పీ కార్యాలయం సమీపంలో స్టాక్ పాయింట్‌లో నిల్వ ఉంచిన కంకర ఇతర సామగ్రిని దొంగలించుకు వెళ్తుండటంపై మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి రాయచోటి అర్బన సీఐ బివి చలపతికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి రమేష్‌కుమార్ రెడ్డి నేరుగా అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి స్వయంగా రాసిన ఫిర్యాదుపత్రాన్ని సీఐకు అందజేశారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దోపిడీకి పాల్పడిన వారి పట్ల చర్యలు తీసుకోవాలని సీఐను కోరారు. అలాగే కంకర ఇతర సామగ్రిని తరలిస్తున్న జేసీబీ, టిప్పర్లను పోలీసులకు స్వాధీనం చేశారు.